కథ




## గ్లోబల్ హాస్పటల్స్- ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక

కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన శృంగార కథ

# కమలాకుచ...

అరుణ



సాయంత్రం ఆరు గంటలు.

స్కూటర్ పార్క్ చేసి మెట్లెక్కి పైకి వచ్చాడు అనంత్.

ఇల్లు తాళం వేసి ఉంది.

వాణి ఎక్కడికి వెళ్లి ఉంటుంది? గుమ్మం వద్ద నిలబడి ఆలోచిస్తున్నాడతను.

పక్క పోర్షన్ గృహిణి అతని రాకను గ్రహించి బయటకి వచ్చి తాళం చెవులందించింది.

"వాణిగారు గుంటూరు వెళ్లారు. మీకు తాళం చెవులు ఇవ్వమన్నారు."

ఆశ్చర్యంగా చూస్తూ తాళం చెవులు తీసుకున్నాడు.

తలుపు తాళం తీసి లోపలికి నడిచాడు.

ఊరికి ఎందుకు వెళ్లి ఉంటుంది? అతను ఇంకా ఆలోచిస్తూనే ఉన్నాడు.

ఉదయం తాను ఆఫీసుకు వెళ్లేటప్పుడు ఏమీ చెప్పలేదు. కనీసం ఆఫీసుకు కూడా ఫోన్ చేసి చెప్పలేదు.

అలసటగా అనిపిస్తోంది. కొంచెం కాఫీ త్రాగితే బాగుండు అనిపించింది. కాని లేచి కాఫీ తయారుచేసుకునే ఓపిక లేదు.

కాఫీ చేసే అలవాటు తప్పిపోయింది పెళ్లయిన తరువాత.

స్నానం చేశాడు.

ఆకలిగా ఉంది. అన్నం వండుకోడానికి బద్ధకంగా అనిపిస్తోంది. బయటకి వెళ్లి తినాలనిపించడం లేదు.

చదువుచున్న పేపర్ పక్కన పడేసి అరటిపండ్లు తిన్నాడు. టివి పెట్టుకుని న్యూస్ చూస్తుంటే నిద్రపట్టింది.

కొద్దిసేపయ్యాక లేచి టివి ఆఫ్ చేసి తలుపులు వేశాడు.

హాల్లో ట్యూబ్‌లైట్ తీసి బెడ్‌రూమ్‌లోకి నడిచాడు.

ఫ్యాన్ వేసి మంచం మీద వాలిపోయాడు.

మరునిమిషంలో అతనికి గాఢంగా నిద్రపట్టింది.

ఉదయం ఆరు గంటలకు మెలకువ వచ్చింది అనంత్‌కు.

లేచి బ్రష్ చేసుకున్నాడు.

తెల్లవారుఝామున స్నానం చేసి సూర్యోదయానికి ముందే పూజా పీఠం వద్ద దీపం వెలిగించడం వాణికి అలవాటు. ఆ సమయంలో వెలిగించిన దీపపు కాంతి గోరంత ఉన్నా కూడా ఆ వెలుగు ఇల్లంతా పరుచుకున్న భావన కలుగుతుంది.

ఆమె పనులు చక్కబెట్టుకుంటూ ఇల్లంతా కలియ తిరుగుతుంటే కాలి పట్టీల సవ్వడి, చేతిగాజుల సవ్వడి మృదుమనోహరంగా వినిపిస్తూ ఉంటాయి.

వాణి ఉంటే ఇంట్లోని వస్తువులకు చైతన్యం వచ్చినట్లు ఇల్లంతా కళకళలాడుతూ ఉండేది.

మరి ఇపుడు ఆమె ఇంటిదగ్గర లేదన్న సంగతి వాటికి కూడా తెలిసిందా? అవి కూడా తనలాగే చైతన్యరహితంగా ఉన్నాయి అనుకున్నాడు.

ఆమె లేకపోవడంవల్ల ఇల్లంతా బోసి పోయినట్లయింది.

ఊరికి ఎందుకు వెళ్లింది? ఎప్పుడు వస్తుంది? మనసులో ఒక్కక్షణం ప్రేమగా విసుక్కున్నాడు.

డబుల్ కాట్ పక్కన ఉన్న టీపాయ్ మీద కాగితం కనిపించింది. గాలికి ఎగిరిపోకుండా పేపర్ వెయిట్ పెట్టి ఉంది. ఆశ్చర్యంగా చేతిలోకి తీసుకుని మడత విప్పాడు.

ప్రియమైన మీకు,

మా అమ్మా, నాన్నను చూడాలనిపించి ఊరికి వెళుతున్నాను. చెప్పకుండా వెడుతున్నందుకు కోప్పడకండి. ఈ రోజు మీతో చెప్పకుండా పుట్టింటికి వెళ్లడానికి కారణం చెబుతాను.

మన పెళ్లయిన ఈ ఆరునెలల కాలంలో మీరు నన్ను ఎంతో బాగా చూసుకున్నారు.


నేను అడగకపోయినా కూడా వారానికి, పది రోజులకు సినిమాకు తీసుకువెళ్లేవారు. సాయంత్రం పూట ఇంటికి వచ్చేటప్పుడు పూలు తెచ్చి ప్రేమగా నా చేతికందించేవారు. నేను నోరు తెరిచి అడగకముందే సమృద్ధిగా అన్నీ అమర్చి పెడుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే నన్ను కనిపెంచి 19 యేళ్లు పోషించిన మా అమ్మా నాన్నను మరిపించారు ఈ ఆరునెలలనుండి.

ఇంటర్మీడియట్ వరకు మాత్రమే చదువుకున్న నన్ను పెద్ద చదువులు చదవలేదని మీరు ఏనాడూ బాధపెట్టలేదు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన మా పుట్టింటి ఆర్థిక పరిస్థితులు గ్రహించి పెళ్లిలోగాని, పెళ్లయిన తరువాత గాని లాంఛనాల గురించి, పెట్టుపోతల గురించి మా అమ్మా నాన్నలను ఏ విధంగానూ మీరు ఇబ్బంది పెట్టలేదు. అందుకు జీవితాంతం మీకు ఋణపడి వుంటాను.

అన్ని విషయాల్లోనూ మీరు నన్ను ఎంతో ప్రేమగా చూసుకుంటారు.

పుణ్యం కొద్దీ పురుషుడు అన్న సామెత నా విషయంలో రుజువైంది. మన పెళ్లయిన తర్వాత మీకు తెలిసి నన్ను ఏ విషయంలోనూ కష్టపెట్టలేదు.

ఇంట్లో ఉన్నంతసేపూ నా వెనుక తిరుగుతూ అల్లరి చేస్తూ మీ ప్రేమలో నన్ను ముంచెత్తేవారు. రాత్రిపూట మీలో ఉండే



ఉత్సాహం గురించి చెప్పడానికి మాటలు చాలవు. స్వర్గపుటంచుల్లో విహరిస్తూ నాతో కలిసి సయ్యాటలాడేవారు. మన పెళ్లయిన రోజు నుండి ఈ రోజువరకు ప్రతీ రాత్రి మనకు వసంతరాత్రే అయింది.

మీరు నన్ను ఎంత ప్రేమగా చూసుకుంటున్నారో నేను కూడా మిమ్మల్ని అలాగే విలువగా చూసుకుంటున్నాను.

మీ ఇల్లాలుగా నా విధులు సక్రమంగా నిర్వర్తిస్తున్నాననే అనుకుంటున్నాను. నా చేతివంటను మెచ్చుకుంటూ, ఇల్లు చక్కదిద్దుకోవడంలో నా కళాత్మక హృదయాన్ని మీరు ఎన్నోసార్లు ప్రశంసించారు. నా విలువ గుర్తించినందుకు మీకు కృతజ్ఞతలు.

ఇలా ఏ కోణంలో చూసినా కూడా మీరు మంచి భర్తగానే ఉన్నారు. మంచి అలవాట్లతో, చక్కటి ఆలోచనా ధోరణితో సమాజంలో బాధ్యతగల వ్యక్తిగా ప్రవర్తిస్తూ, ఆఫీసులో విధి నిర్వహణలో ఎంతో సమర్థమైన ఉద్యోగిగా పనిచేస్తూ పై అధికారుల ప్రశంసలు పొందుతూ ఉండే మిమ్మల్ని చూస్తే సంతోషంగానూ, గర్వంగానూ అనిపిస్తుంది.

గోరింటాకు పెట్టుకున్నప్పుడు ఎర్రగా పండిన నా చేతులను చూసి నీకు మంచి మొగుడు వస్తాడు అని చిన్నప్పటి నుండి నన్ను అందరూ ఆట పట్టించేవాళ్లు. ఆ మాట నిజమే. నా భర్త నిజంగా మంచివాడే. కాని ఒకే ఒక్క విషయంలో మీ మాటలు ఈటెల్లాగా బాధపెడుతున్నాయి నన్ను.

అన్ని విషయాల్లోనూ నన్ను సంతోషపెట్టే మీరు కేవలం ఒకే ఒక్క విషయంలో బాధకు, అవమానానికి గురిచేశారు. మన వైవాహిక జీవితంలో మీరు ఆ మాటను ఇప్పటికీ నాలుగుసార్లు అన్నారు. మీనోటి నుండి వెలువడిన ఆ మాట నన్ను తీవ్ర మనస్తాపానికి గురి చేసేది. నా తప్పు లేకపోయినా కూడా మీరన్న ఆ మాటకు నేను అపరాధిలా తలవంచుకునేదాన్ని.

ఇందులో నా తప్పేమీ లేదు కదా! నేనేం చేయగలను అని మనసులో బాధగా వుండేది. కాని జవాబు చెప్పకుండా మౌనంగా ఊరుకునేదాన్ని.

మన పెళ్లయిన నాలుగు రోజుల తర్వాత మీనోటి నుండి వెలువడిన ఒకే ఒక మాట నా మనసును గాయపరచింది. నన్ను నేను పరిశీలనగా చూసుకుని బాధపడ్డాను. నిజమే కదా అనిపించింది. ఆ తర్వాత కొద్ది రోజులకు



## అమ్మో ఐశ్వర్య!

**త**నను గురించిన రకరకాల తాజా వార్తలతో వివేక్ ఒబెరాయ్ పత్రికల వాళ్ల దగ్గరికి వెళ్లటం బెంగాలీభామ ఐశ్వర్యను విసుగెత్తించిందేమో, వివేక్ మీద అలిగిందిట. అదలా వుంచితే, 'ప్రైడ్ అండ్ ప్రెజుడిస్'లో ఆంగ్లనటుడు మార్టిని హెండర్సన్‌తోచాలా హాట్ సీన్లలో చేసిందట. సినిమాటోగ్రాఫర్, దర్శకుడూ తప్ప మిగతా అందరినీ సెట్ల మించి బయటికి పొమ్మందిట. అంతిదిగా వున్నాయట సీన్లు. బెంగాలీ చిత్రం 'చోఖేర్ బాలీ'లో కూడా హీరో ప్రసేన్‌జీత్‌ను రెచ్చగొట్టే దృశ్యం ఒకటుందట. వివేక్ ఒబెరాయ్‌తో కూడా 'క్యూం, హోగయా నా?'లో ఓ ముద్దు దృశ్యం వుందిట. "చాలా మారింది" ఐశ్ అనుకుంటున్నారు.

అదే మాట అన్నారు. గుండె కలుక్కుమనిపించింది.

గత నెలలో ఆ మాట రిపీట్ అయింది మీనోటి నుండి. మనసు విలవిలలాడి జవాబు చెప్పలేక ఊరుకుండిపోయాను.

గతరాత్రి మనమిద్దరం ఏకమై అద్భుతమైన భావన మది అంతా నిండుగా ఒకరిలో ఒకరం కలిసిపోయి అలసిపోయాము.

సంతృప్తిగా మీ మీద నాకున్న అపారమైన ఇష్టాన్ని వ్యక్తం చేస్తూ మీ ఛాతీపై తల ఆనించి పడుకున్నాను. మీ చేతులను నా చుట్టూ తిప్పి గాఢంగా హత్తుకున్నారు. ఆ సమయంలో మీ నోటినుండి నాలుగోసారి వెలువడిన మాట నా హృదయంలో శూలాన్ని దింపింది. జవాబు చెపలేక బలవంతంగా నవ్వాను.

ఆ మాట మీ నోటి నుండి వెలువడిన కొద్ది నిమిషాలకే మీరు ఆదమరచి నిదురపోయారు. కాని ఆ మాట రాత్రి అంతా నన్ను నిద్రకు దూరం చేసింది. నా తనువు, మనసు అవమాన భారంతో విలవిలలాడాయి. ఎవరికి చెప్పుకోవాలి ఈ బాధ? ఏమని చెప్పుకోవాలి? ఎలా ఊరట చెందాలి? అనుకున్నాను.

ఈ బాధ కేవలం మీతో మాత్రమే చెప్పుకోగలను. మరెవ్వరితోనూ షేర్ చేసుకోలేను అనిపించింది. అందుచే సిగ్గువిడిచి ఈరోజు నా బాధను మీతో పంచుకుంటున్నాను.

నా వక్షభాగం చిన్నదిగా ఉంటుంది అని మన వైవాహిక జీవితంలో మీరు ఇప్పటివరకు నాలుగుసార్లు అన్నారు.

వెండితెర మీద, బుల్లితెర మీద కొందరు తారామణుల కృత్రిమ వక్షసోయగాలు చూసిన మీకు అలాంటి ఫీలింగ్ కలగడం సహజమేమో!

స్త్రీలందరి అందం ఒకలా ఉండదు. కొందరి అందం నడకలోనూ, మరి కొందరి అందం నవ్వులోను, ఇంకొందరి అందం నడతలోను, కొందరు స్త్రీల అందం ఉన్నతమైన వక్ష సంపదలోను ఉంటుంది. ఎవరి దేహదారుఢ్యం వారిది. ఎవరి కనుముక్కు తీరు వారిది. ఎవరి అందం వారిది.

వక్ష సౌందర్యం విషయంలో మీరు నన్ను వేలెత్తి చూపినట్లుగా నేను కూడా మీ అందం గురించి కామెంట్ చేయవచ్చు. మరొకరితో పోల్చవచ్చు. కాని నేను అలా అనను. అలా వేలెత్తి చూపడం మరొకరితో మిమ్మల్ని పోల్చి బాధపెట్టడం తప్పు కాబట్టి నేను ఆ పని చేయను. అలా వేలెత్తి చూపాలన్న భావం నాలో లేదు, ఇక ముందు కూడా కలగదు.

మిమ్మల్ని బాధ పెట్టాలని ఈ ఉత్తరం రాయడం లేదు. ఇకనుండి ఆ మాటతో నన్ను ఆవేదనకు గురి చేయవద్దని కోరుతూ ఈ ఉత్తరం రాస్తున్నాను.

అమ్మను, నాన్నను చూడాలని మనసు బెంగగా వుంది. మన పెళ్లయ్యాక మొదటిసారిగా పుట్టింటికి వెళుతున్నాను. మీకు చెప్పకుండా వెళుతున్నందుకు ఏమీ అనుకోరు కదూ?

మీ వాణి

ఉత్తరం చదవడం ముగించి దుఃఖంగా కళ్లు మూసుకున్నాడు అనంత్.

భార్యను ఎంతో అపురూపంగా చూసుకుంటూ కేవలం ఒకే ఒక్కమాటతో ఆమెలోని స్త్రీత్వాన్ని అవమానపరచినందుకు తనమీద తనకే అసహ్యంగా అనిపిస్తోంది అతనికి.

తెరమీద కొందరు తారల అందాలు కృత్రిమమైనవని తానెందుకు గ్రహించలేకపోయాడు. భార్యను ఎంతగా అవమానపరిచాడు? తనలో ఆ సంస్కారం

ఎందుకు లోపించింది.

టైమ్ చూశాడు. ఏడు గంటలైంది. మరో అరగంటలో గుంటూరు బస్సు ఉంది.

స్నానం చేయడానికి కూడా టైమ్ లేదు.

డ్రస్ మార్చుకుని బస్టాండుకు బయల్దేరాడు.

అతను వెళ్లేటప్పటికి వరండాలో వాలుకుర్చీలో కూర్చుని పుస్తకం చదువుకుంటున్నారు మామగారు. పక్కనే కింద కూర్చున్న అత్తగారు చీరమీద ఎంబ్రాయిడరీ చేస్తోంది శ్రద్ధగా.

గేటుతీసిన చప్పుడుకు తలెత్తి అల్లుడ్ని చూసి సంతోషంగా ముఖాలు చూసుకున్నారు అత్తమామలు.

కుశల ప్రశ్నలు అయ్యాక అత్తగారి చేతిలో నుండి మంచినీళ్లు అందుకుంటూ "వాణీ ఎక్కడ?" అడిగాడు.

"లోపల నిద్రపోతోంది" చెప్పింది అత్తగారు.

గుంభనంగా నవ్వుకున్నారు అత్తమామలు.

గదిలో నిద్రపోతోంది వాణి. వెళ్లి మంచం మీద ఆమె పక్కన కూర్చున్నాడు నిశ్శబ్దంగా. నిద్రలేచి కళ్లు తెరిచింది కొద్దిసేపయ్యాక.

మంచం మీద అతి సన్నిహితంగా కూర్చుని తనవైపే చూస్తోన్న భర్త కనిపించాడు.

"ఎప్పుడు వచ్చారు?" లేచి కూర్చుంటూ అడిగింది.

"ఇప్పుడే".

ఆమె చేతులను తన చేతుల్లోకి తీసుకుని చెంపలకు ఆనించుకున్నాడు -

"అయామ్ సారీ!" నెమ్మదిగా చెప్పాడు.

నవ్విందామె మనోహరంగా.

"ఉదయం 7 గంటలకు నువ్వు రాసిన ఉత్తరం చదివాను. నా మాటలు నిన్ను ఎంతగా నొప్పించాయో అర్థమైంది. వెంటనే నిన్ను చూడాలనిపించి వచ్చాను. ఆ మాట అనకూడదన్న జ్ఞానం నాకు లేకపోయింది. ఇంకెప్పుడూ అలా మాట్లాడను. క్షమిస్తావు కదూ!"

మరోసారి నవ్విందామె.

"భోజనానికి లేవండి." అత్తగారు గది తలుపుకు అవతలివైపు నిలబడి పిలిచింది.

స్నానం చేసి భోజనం చేశాక మామగారితో అన్నాడు. "సాయంత్రం వాణి, నేను బయల్దేరి వెళతాము."

"అమ్మాయి కొంచెం నీరసంగా ఉంది. కొద్దిరోజులు రెస్ట్ అవసరమని డాక్టరుగారు నిన్న చెప్పారు." అత్తగారు అంది.

అయోమయంగా చూశాడు. పక్కనే నిలబడి ఉన్న వాణివైపు చూశాడు. ఆ సరికే అత్తమామలు గదిలోంచి బయటకి వెళ్లారు.

నవ్వింది వాణి సిగ్గుగా. అప్పుడర్థమైంది. ఆమెను మృదువుగా హత్తుకున్నాడు.

***

8 నెలల తరువాత

పాప బారసాల.

ఇల్లంతా బంధుమిత్రులతో కోలాహలంగా ఉంది.

గదిలోకి వచ్చిన అనంత్‌కు మనోహరమైన దృశ్యం కనిపించింది.

వాణి ఒడిలో పడుకున్న పాప తన ఆకలి తీర్చుకుంటోంది. క్షీరంతో సమృద్ధిగా వున్న వాణి వక్ష ద్వయం నిండుగా, పరిపూర్ణంగా కనిపిస్తోంది. పాలు తాగుతున్న పాపను తన్మయత్వంగా చూసుకుంటూ మురిసిపోతోంది వాణి. గదిలోకి వచ్చిన భర్తను చూసి సిగ్గుగా నవ్వి చీర సరిచేసుకుంది.

సిగ్గుపడుతున్న భార్యను నవ్వుతూ చూసి గది తలుపు దగ్గరగా వేసి వెళ్లాడతను. ■